బల్లచెక్క

కాంతయ్యకి జీవితం కొంత ఖుషీగానే వెళ్ళిందనీ (అలానే వెళ్తోందనీ కూడా) చెప్పాలి. అతనికి చిత్రాంగి లాంటిదే అయినప్పటికీ చెప్పినమాట వినే భార్య దొరికింది. ఊరికే వెర్రికాపు కాసేయకుండా ఆవిడతనికి చక్కగా గడుసుగా ముగ్గురే పిల్లల్ని కనిచ్చింది. ఆడా మగా మగా-అదీ వరస;అమ్మాయి సావిత్రి కొంచెం వెర్రిబాగుల్ది కాని మగపిల్లలిద్దరూ సిసింద్రీల్లా వుంటారు. సావిత్రి ఎల్లప్పుడూ పుస్తకాల్చదువుతూ ఏదో లోకంలో ఉంటుంది. పదహారేళ్ళే అయినప్పటికీ బాగా పొడవుగా ఉంటుంది. తెలిసినవాళ్ళు ఆ పిల్లని అమాయకురాలంటారు. తెలియనివాళ్ళు ఆ మరీ పెద్ద బేలకళ్ళు చూసి వెర్రిదనుకుంటారు.

అన్నదమ్ముల పంపకాల్లో కాంతయ్యా వాటాకి అయిదెకరాల పొలమూ, ఓ పదెకరాల మావిడితోటా, (కేటాయింపుగా) ఓ చిన్న ఇల్లూ వచ్చేయి. నలభయ్యేళ్ళపాటు అతని జీవితం హాయిగా నడిచిపోయింది. పొలం రెండు పంటలు పండుతుంది. మావిడితోట ప్రతీ

యేడు విరగకాస్తుంది. ఇల్లు చిన్నదే అయినప్పటికీ పెద్ద పెరడుంది. అందులో మంచినీళ్ళ నుయ్యుంది. పేకాటా, పిట్టలవేటల్లో సుఖంగా కాలం గడిపేడు కాంతయ్య.

తరువాత, అంటే రెండేళ్ళ క్రిందట పండులో పురుగు ప్రవేశించి నట్టు కాంతయ్యలో ఓ రోజున మంచి ముహూర్తాన్న లాభం యెడల దాహం ప్రవేశించింది. అతనో రోజు మధ్యాహ్నం నిద్ర లేచేసరికి వీధిలోంచి పెద్ద బాండు మేళపు సందడి వినిపించింది. ఏఁవిఁటో అని చూస్తే— వీరిగాడ్ని ఊరంట ఊరేగిస్తున్నారు, కారుమీద.

వీరిగాడికి, లోగడ, సందుచివర చిన్న ఇనప కొట్టుండేది. సైజుకి వాడు దమ్మిడీ అంత మనిషి. మొన్న మొన్నటి దాకా వాడి విలువ కూడా దమ్మిడీనే. వాడు ఆ ఇనుప కొట్టుని ఇనుపమిల్లు కింద మార్చి ఇంకా పెద్దదిగా పెంచుతున్నాట్ట. అమెరికా ఐరోపాలు వెళ్ళొచ్చేట్ట. అందుగురించి ఇప్పుడు కారెక్కి బజార్లో బాజాల్తో ఊరేగుతున్నాట్ట. అలాగే వెంకడుగాడు, సుబ్బడుగాడు, సూరిగాడు, వెర్రిగాడు, వెధవగాడు, వెధవ చచ్చుగాడు, చచ్చు పెద్దమ్మగాడు! అందరూ కూడా మేకుల్లా బిగిసిపోయి తాటిచెట్లల్లా పెరిగిపోయి మర్రిచెట్లల్లా విస్తరించుకు్కర్చున్నారు. వాళ్ళంతా శ్రీరామచంద్రులూ సత్యహరిశ్చంద్రులూ కారని కాంతయ్యకి తెలుసు. వాళ్ళంతా ఎలా పెద్దవాళ్ళయారో అతను వెంటనే భోగట్టాచేసి తెలుసుకున్నాడు. దాన్తో అతనికి మెలకువొచ్చింది కన్ను విడింది. బుర్రలో దమ్మిడీ ఎత్తు బుద్ధీ, మాయా గల ప్రతివాడూ సంతలో చవటగాళ్ళని పబ్లిగ్గా దోచుకు తింటూంటే తను చేతులు ముడుచుకొని పెరట్లో కూర్చుండి పోవడం నచ్చింది కాదు కాంతయ్యకి. కాంతయ్య కూడా ఊళ్ళో ఉన్నాడు, సంతలోని లాభాల్లో కాంతయ్య వాటా కాంతయ్యకి రావాలి, ఎందుకురాదో, ఎలా రాదో అతనూ చూస్తాడు.

అందుచేత ఈ రెండేళ్ళ నుంచీ-పద్దెనిమిదేళ్ళ కుర్రాడికి స్త్రీవాంఛ పట్టుకున్నట్టు_కాంతయ్యకి ధనవాంఛ పట్టుకుంది. అతి అర్జంటుగా డబ్బులు గుంజేసి లాభాలు పిండేసి మూటలు కట్టేసి మేడల్లేపేసి మహా భాగ్యవంతు ణ్నయిపోదా మనే కోరిక ఇప్పుడతణ్ని దెయ్యం పట్టుకున్నట్టు పట్టుకొంది. డబ్బూలాభం! డబ్బూలాభం! అదే ఇప్పుడతని ధ్యేయం.

"లాభం" అనేమాట ఇంట్లో అన్నిసార్లు వినడం వల్లనే "లాభం అంటే ఏమిటీ" అనే ఆలోచన పట్టుకుంది సావిత్రికి. ఆ ప్రశ్న చాలా సింపుల్ ప్రశ్నే కాని దాని కెవరూ సరైన సమాధానం ఆమెకి చెప్పలేక పోయేరు. వాళ్ళ అమ్మ నడిగితే ఆమె ఖచ్చితంగా జవాబు చెప్పింది.

"రెండువేల కట్నానికి నీకు రెండు లక్షల మొగు డొస్తే అది మనకి లాభం, అదే లాభం అంటేను. తెలిసిందా?"

సావిత్రికి తెలియలేదు. ఆ విధంగా తల్లి ఫేలయితే తండ్రి బోధపర్చడానికి ప్రయత్నం చేశాడు.

"కిందటేడు ధాన్యం రూపాయి క్కుంచెడు చొప్పున కొన్నావా? కొని కుంచె ద్రెండ్రూపాయల కమ్మేవా? రూపాయిలాభం ఒచ్చింది కద! అదేలాభం! అంతే మరింకేంలేదు."

"ధాన్యానికి రూపాయి తీసుకున్నావు, కాని మరి ఆ రెండో రూపాయి ఎందుకు తీసుకున్నావు?"

"ఒట్టినే తీసుకున్నాం! అదీసంగతి!" అంటూధాన్యం కొనుక్కున్న చవటగాణ్ని తల్చుకొని తల్చుకొని నవ్వేడు కాంతయ్య ఆ నవ్వుచూసి సావిత్రికి భయంవేసింది.

బళ్ళో మాస్ట ర్నడిగితే.

"లాభనష్టా లెక్కల్వేస్తున్నావుకదా ! ఆపాటి తెలీదా ఇంకాను ?" అన్నాడతను.

వింద రెన్ని తాత్పర్యాలు చెప్పినా, సావిత్రి నెత్తికి మాత్రం ఎమీ ఎక్కలేదు.

ఇంతలో మొన్న ఈమధ్యే బావ వచ్చాడు; అతనిపేరు సత్య మూర్తి.

ఆ కుర్రవాడి తల్లికి పసుపూ కుంకం కింద ఓ ఎకరం ఇస్తా నన్నాడు ఆమె తండ్రి. ఇవ్వకుండా చేసినవాడు కాంతయ్య. అక్కకి తను నష్టం కలుగజేసి నందుకు అక్కయెడలా ఆమె పిల్లల యెడలా చాలా కోపం వుంది కాంతయ్యకి; లేళ్ళంటే పులికి కోపం ఉన్నట్టు.

"సత్తిగాడికి" చదు వబ్బలేదు. దుర్గాపూర్లో "వడ్రంగి వెధవ పని" చేసుకు బతుకుతున్నాడు. అటువంటి పని చేసు కొంటూ అందులోకూడా ఆ కుర్రాడు కిఫాయితీగా బతగ్గలగడం కాంతయ్య కోపానికి రెండో కారణం. ఆ వడ్రంగి బావ్వెనకాతల వెర్రిదాన్లా సావిత్రి తిరగడం కాంతయ్య కోపానికి మూడో కారణం.

ఇంటి కొస్తున్న మేనల్లుణ్ని, "ఎన్నాళ్ళురా సెలవూ"? అని అడిగేడు కాంతయ్య.

"సెలవు నెల్లాళ్ళు. మీ ఇంట్లో ఉండడం మూణ్నాళ్లు." అన్నాడు సత్యమూర్తి,

ఆ కుర్రాడివి మేనమామకిలాగే పెద్ద కళ్ళు. అతను చురుగ్గా చాలా హెచ్చరిగ్గా రెపరెపలాడుతూ ఉంటాడు. నిక్కర్లో (లేక పట్లాంలో) చొక్కా టక్ చేసుకు తిరుగుతాడు. అతనిచేతులు రాళ్ళ లాగా, మాటలు చాకుల్లాగా ఉంటాయి. రాతిలో చకచకా మలిచిన బొమ్మలా ఉంటాడతను.

వచ్చినరోజు మధ్యాహ్నమే పెరట్లో ఓ వార సాలలో నాలుగు పెద్ద దేవదారు పెట్టెలు చూసేడు సత్యమూర్తి. వర్షపు తుంపరకి తడిసీ, వాలుఎండకి ఎండీ అవి బాగా ఎరుపెక్కి ఇంకొన్నాళ్ళకి నలుపుడాలు తెచ్చుకోబోతున్నాయి.

''సాల్లో పాకేజి పెట్టె లున్నాయి మాఁవాఁ'' అన్నాడు సత్యమూర్తి.

''అవును. ఉన్నాయి'' అన్నాడు మాఁవఁ.''

''నాల్రూపాయలిస్తాను ఇచ్చేస్తావా ?''

భోంచేసి వాలుకుర్చీలో కూర్చున్న కాంతయ్యకి అల్లుడి మాటల్లోని వెటకారానికి కోపం వచ్చినప్పటికీ ఆ కోపం కనపడ్నివ్వకుండా, టూకీగా. —

''ఇవ్వను'' అన్నాడు.

స్తంభం వారన నిలబడి బావనీ నాన్ననీ అటూఇటూ చూస్తోంది సావిత్రి.

"ఏం ? లాభం చాల్దా ?" అని సాగదీసేడు సత్యమూర్తి.

''అవును, చాల్దు అన్నాడు కాంతయ్య.

''నేను లాభంకోసవేఁ బతుకుతాను. నువ్వేకాదు, ఎవడేఁ వనుకున్నా నాకు లక్ష్యంలేదు" అనేభావం కాంతయ్య మాటల్లో వ్యక్తావ్యక్తంగా వినిపించింది.

"నాకోసం కాదు మాఁవఁయ్యోయ్ ! ఇనపకొట్టు రామంగాడికి ఇచ్చేస్తాను, ఎంతకైతే ఇస్తావో చెప్పెయ్ !" అన్నాడు సత్యమూర్తి.

"పన్నెండైతే పట్టుకెళ్ళమను" అన్నాడు కాంతయ్య.

''పొయ్యిలో పెట్టినా కాలవవి. బేడా పరక పెట్టెలికి నీకు

పన్నెండు రూపాయలా ? కావాలా ?" అంటూ నవ్వేడు సత్యమూర్తి. ఆ మాటకి తనుకూడా నవ్వాలా వద్దా అని ఆలోచిస్తూ నిలబడి పోయింది సావిత్రి.

"అవి చెదపట్టిపోయి చెడిపోయినా సరే కాని లాభానికి తప్ప అమ్మను" అన్నాడు కాంతయ్య, సిగరెట్టు ముట్టిస్తూ, ఆ తరవాత పుల్ల పారేస్తూ పొగవదులుతూ "ఏ చెవల వెధవో ఒచ్చి కొనుక్కోకపోడు. అందాకా వాట్నలా ఉణ్నీ, నష్టం వేం లేదు." అన్నాడు.

"నష్టంవెందుకు మాంవయ్యా ? లాభం ఒచ్చేట్టు నే చూస్తాకదా !" అన్నాడు సత్యమూర్తి సరదాగా నవ్వుతూ.

మర్నాడు.

మధ్యాహ్నం మూడుగంట లయింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పరుపంతా చెమటతో తడిసిపోడంతో కాంతయ్యకి మెలకువొచ్చింది. మధ్యాహ్నం ఒంటి గంటకి బాగా భోంచేసి వచ్చి, గది తలుపు లన్నీ బిడాయించుకొని మంచం మీద వాలడం కాంతయ్యకి అలవాటు. నలభై రెండేళ్ళ జీవితంలో పాతికేళ్ళ అలవాటది. అతను పడుక్కొనే గదికి ఒకటే ద్వారం, ఒకటే కిటికీ. ఆ కిటికీ తరుచు మూసే ఉంటుంది. ఒకవేళ తెరిచినప్పటికీ కూడా గదిలో చీకటి కొంచెం తగ్గినట్టుందేకాని కొంతగా అయినా వెలుగుమాత్రం లోనికి వచ్చినట్టుండదు. ఆ గది వేసవికాలంలో అతి వెచ్చగా ఉంటుంది, చలికాలంలో అతి చల్లగా ఉంటుంది.

కాళ్ళమీంచి ముఖందాకా కప్పుకున్న దుప్పటి పక్కకి తీస్తూనే. పొడుం పట్టు ఎక్కించేడు కాంతయ్య. ఇరవయ్యేళ్ళ అలవాటది. పొడుంపట్టు ఎక్కించేక బద్దకంగా అలా పడుక్కొని సుఖంగా డబ్బు గురించి ఆలోచించసాగేడు. రెండేళ్ళకిందటివరకూ అతనికి ఆడవాళ్ళ గురించి ఆవిధంగా ఆలోచించడం సుఖంగా ఉండేది. ఇప్పుడైనా ఆడ

వాళ్ళు అతనికి అక్ఖర్లేకపోలేదు. కాని డబ్బుతో వస్తేనే వాళ్ళతనికి కావాలి. "చేచ్చవుఁరు భాగోతపు రోజులు ఎత్తికట్టీసేం. చవుఁరది తెచ్చుకుంటేనే దీపం వెలిగిస్తాను. లేకపోతే పొమ్మను." అంటా డిప్పుడు. కాంతం గురించి డబ్బు విదిలింపులు పూర్తిగా బంద్ చేసేశా డతను.

కొంతసేపు అలా ఆలోచిస్తూ ఉండగా కాంతయ్యకి ఏవో చప్పుళ్ళు వినిపించాయి. అది డబ్బు చప్పుడు కాదు. పెరట్లోంచి కాబోలు ఆ చప్పుడు వస్తోంది. ఆ ఇంట్లో అటువంటి శబ్దాలు అత నెప్పుడూ విన్లేదు.

"ఏఁవిఁటి చెప్మా ?"

అనుకొంటూ లేచి పెరటి వరండాలో కెళ్ళి అక్కణ్ణించి నిల బడి చూసి, పనస చెట్టు నీడని హడావిడి చేస్తూన్న మేనల్లుణ్ణి "ఏంట్రా చేస్తున్నావ్ సత్తిగా ?" అంటూ కేకవేసి ప్రశ్నించేడు కాంతయ్య.

ఆ పనసచెట్టుకింద కాంతయ్య ముగ్గురు పిల్లలూ బావగారి వడ్రంగి పని వైపు కళ్ళప్పగించి చూస్తున్నారు.

తండ్రి వేసిన ప్రశ్నకి,—

"టేబిల్సు ! టేబిల్సు !" అని సమాధానం చెప్పింది సావిత్రి.

"టేబిల్సూ, స్టూల్సు, పీటలూను !" అని కాంతయ్య పెద్ద కొడుకు, పన్నెం దేళ్ళవాడు కేకవేసేడు.

కాంతయ్య రెండో కొడుకు, ఎనిమిదేళ్ళవాడు, తండ్రి గొంతుక వినగానే, అతి సంతోషంగా ముఖంపెట్టి, అతి రయ్ఁమని పరిగెట్టు కొచ్చి, తండ్రి కాళ్ళని కౌగలించుకొని తలెత్తి తండ్రి ముఖంలోకి చూస్తూ నవ్వుతూ ! "బావ ! బల్లలు ! బల్లలేస్తున్నాణ్ణాన్నా బావా ;"

అని, అద్భుతమైన ఆనందంతో అమెరికా వెళ్ళివచ్చిన ఆదిమవాసుళ్ళా చెప్పి వెంటనే అర్జంటుగా మళ్ళీ బావదగ్గిరకు పారిపోయి హడావిళ్లో పడిపోయేడు.

చెట్టు నీడని అరుగుదగ్గిర దేవదారు పెట్టెలు చెక్కలు చెక్కలుగా విడిపోయున్నాయి. కొన్నింటికి చిత్రికపట్టడం పూర్తయింది. వాటిలో కొన్ని పచ్చగా పాళాబంగారంలా ఉన్నాయి. మరికొన్ని రాగి కలిపిన బంగారంలా ఉన్నాయి. అరుగుమీద ఓ చెక్క దాపుపెట్టి సత్యమూర్తి చిత్రికపడుతున్నాడు. రాళ్ళమీద కూర్చున్న పిల్లలు చీటికీ మాటికీ లేస్తున్నారు. తుక్కు పోగుచేస్తున్నారు : బల్లల్ని నిమురుతున్నారు; అదేమి టిదేమి టని ప్రశ్నిస్తున్నారు; రంపాన్ని పట్టుకు తిప్పుతున్నారు; సాఫవుతూన్న బల్లచెక్కవైపు బంగారంగా మారుతున్న ఇనుముని చూసినట్టు చూస్తున్నారు.

కాంతయ్య మొదట ఆశ్చర్యపోయేడు ! తరవాత సంతోషించేడు; ఆ తరవాత కోప్పడ్డాడు.

"నాతో ముందు చెప్పొద్దురా ?" అని మేనల్లుణ్ని కసిరేడు.

"అత్తతో చెప్పేను మావఁ వాఁ" అన్నాడు సత్యమూర్తి.

ఎండాకాలం. మధ్యాహ్నం మూడు దాటింది. ఎండ ఇంకా చల్లారలేదు. సత్యమూర్తి తొడుక్కున్న బనీను చెమటతో బాగా తడిసిపోయింది. ఫంట్లాం మీద కూడా చెమటబొట్లు ఇంకుతున్నాయి.

"ఎందుకూ అవన్నీ ఇప్పుడు ?" అన్నాడు కాంతయ్య.

"మావఁకి అల్లుడి ప్రెజెంటు" అన్నాడు సత్యమూర్తి.

కాంతయ్య చిరునవ్వు నవ్వేడు. ఆ నవ్వులో అనురాగంతో అభిమానంతో కూడిన సంతోషం కంటె ఆశతోకూడిన సంతోషం ఎక్కువుంది. అతనా సమయంలో మూర్తీభవించిన "స్వార్ధం"లా

ఉన్నాడు. తండ్రిని ఆ క్షణంలో చూసిన సావిత్రి ఎందుకోగాని జడుసుకొంది. ఆమెకి ఏదో జ్ఞాపకం వచ్చిన ట్టనిపించింది, ఏదో ఎవరో ఎక్కడో ?

మర్నాటి ఉదయం పది గంటలకల్లా నాలుగు టేబిల్సు. మూడు స్టూల్సూ, ఆరు పీటలూ తయా రయేయి. వాటికి చక్కటి రంగుకూడా వేస్తానన్నాడు సత్యమూర్తి. "చూద్దాం" అన్నాడు కాంతయ్య.

పెరట్లో అంతా చల్లగా ఉంది; దక్షిణం నుంచి చల్లగాలి మెల్లగా వీస్తోంది. దేవదారు సామగ్రి, ఇంటికొచ్చిన గొప్ప బంధువుల్లా, పెరటివరండాలో, శోభగా షోగ్గా అమిరేయి. ఇంట్లో ఉన్నవాళ్ళంతా వాటిని మెరిసే కళ్ళతో చూస్తూన్నారు. లెక్కదాఖలా అయిపోయిన హీరోలా సత్యమూర్తి అటూ ఇటూ తిరుగుతున్నాడు. కొత్త రాజుని ఆత్మీయు లంతా చూసుకొన్నట్టు పిల్లలతణ్ని చూసుకొంటూనే, ఈ బల్ల నాది, ఈ పీట నాది. నీదికాదు నాది; అది నీది ఇది నాది అని ఓవైపు వాదించు కొంటున్నారు. "వాట్ని ముట్టుకొని అప్పుడే తగలెట్టేకండి" అంటూ వాళ్ళమ్మ కేకలు వేస్తోంది. ఆశపడే ముసలివాడు ఆడపిల్లని చూసినట్టు కాంతయ్య ఆ సామగ్రిని గ్రీడీగా చూస్తున్నాడు.

మధ్యాహ్నం ఆటకి పిల్లలు ముగ్గుర్నీ సినీమాకి తీసుకువెళ్తానన్నాడు సత్యమూర్తి. సినీమా అనేసరికి సంతోషపడ్డ చిన్నవాడు, అందలోనే, "నాన్న అందరికీ డబ్బు లివ్వడే !" అంటూ డీలా అయిపోయేడు.

"అందరికీ బావే అభయం ! మరేం భయపడకండి !" అన్నాడు సత్యమూర్తి.

మేనల్లుడి జల్సా చూసి కాంతయ్యకి కోపవూ, ఈర్ష్యా కలిగేయి.

''తగలెటనప్పుడు నేనూ తగలెట్టాను డబ్బు !" అని తనని తానుసముదా యించుకున్నాడు.

సాయంకాలం సావిత్రీ, ఆమె తమ్ముళ్ళూ, బావా సినిమానుంచి కబుర్లు చెప్పుకొంటో వస్తూంటే దార్లో అందరికీ హోటేల్కి వెళ్ళా లనిపించింది. అక్కడికి వెళ్ళేక టిఫిన్ తినా లనిపించింది. కూల్ డ్రింక్స్ తాగాలనిపించింది; ఆ తరువాత బీ చి కి వెళ్ళాలనిపించింది. నలుగురూ కూడా ఆడుతూ పాడుతూ కేరుతూ ఇంటి కొచ్చేసరికి ఎని మిది గంటల రాత్రయింది.

"ఇంతసే పేం చేస్తున్నార్రా !" అంటూ వాళ్ళు రాగానే ప్రశ్నిం చేడు, హాల్లో వాలుకుర్చీలో కూర్చొని డ బ్బు లె క్క పెడుతూన్న కాంతయ్య. ''బల్లలేవీ, బల్లలేవీ ?" అంటూ అతని ముగ్గురు పిల్లలూ పెరటి వరండాలోకి పరిగెట్టారు. సత్యమూర్తి హాల్లో ఓ కుర్చీలో కూర్చొని జోళ్ళు విప్పుతున్నాడు. పెరట్లోకి వెళ్ళిన పిల్లలు అంతలో హాల్లోకి తిరిగి పరిగెట్టుకొచ్చి ''బల్లలేవి నాన్నా?" అంటూ కాంతయ్యని ముగ్గురూ ఒకేసారే అడిగేరు, ఇంట్లో చిలక కనిపించకపోతే ,ఇంటి పిల్లిని అడిగినట్టు.

''ఇవిగో ! యాభై రూపాయలు !" అన్నాడు కాంతయ్య చాలా గర్వంగా.

పిల్లలు నివ్వెర పోయేరు.

''ఏఁవీఁ ? ఏం టయింది ? ?"

"అమ్మేసేను"

''అమ్మేసేవా ? ! !" అంటూ పిల్లలు పగలని శోకంతో అరి చేరు.

"హాయిగా చక్కగా అమ్మేసేను" అన్నాడు కాంతయ్య.

పిల్లల ముఖాల్లో హాయిలేదు, కత్తి వేస్తే నెత్తురుచుక్క లేదు. సావిత్రి పిచ్చిపిల్లలా నిలబడిపోయింది. పెద్దవాడు ఏమీ అర్థంకాని వాళ్ళా అటూ ఇటూ చూస్తూ నిలబడి పోయాడు. చిన్నవాడు కళ్ళనిండా నీళ్ళతో నిలబడి ఆ తరువాత అమ్మదగ్గిర క్యాబోలు ఏడవడాని క్యాబోలు లోనికి వెళ్ళిపోయేడు, కాళ్ళు నేలకి వేసి కొడుతూ చప్పుడు చేస్తూ.

సత్యమూర్తి, ''ఎంతలాభం; అయితే ?" అని తియ్యటి కంఠంతో అడిగేడు.

ఓ పది రూపాయిలు లెక్కపెట్టి వేరుగా తీసి వాటిని కుడిచేత్తో పట్టుకొని,

''నీ క్కావలిస్తే ఇదిగో పది రూపాయలు కట్నం. అది నీకు లాభం" అన్నాడు కాంతయ్య. మేనల్లుడికి ఒక్క పది రూపాయిల నోటు యివ్వడంకంటే పది ఒకరూపాయి నోట్లు ఇవ్వడం బావుంటుం దనీ, దర్జాగా ఉంటుందనీ ముందే నిర్ణయించుకున్నాడు కాంతయ్య.

''నా కూలి నాకు...." అని ఏదో అనబోయేడు సత్యమూర్తి.

''నీకు కూలి మాత్రం ఇవ్వాలంటే అయిదు రూపాయలే అది !" అన్నాడు కాంతయ్య, అంతకుముందే ఆ సంగతి ఆలోచించిన వాళ్ళా.

''మరైతే పదెదుంకు ?"

''ఉంచుకోరా ! అది నా సంతోషం" అన్నాడు కాంతయ్య.

''నా పేర్చెప్పి పిల్లలికి మిఠాయి కొనీ" అన్నాడు సత్యమూర్తి.

''నువ్వేం చెయ్యమంటే అదేచేస్తాను. నీ డబ్బు కాని నాది కాదు." అన్నాడు కాంతయ్య ఆ పదినోట్లూ మిగతా నోట్లలో కలిపేస్తూ.

సత్యమూర్తి కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు. విద్యుత్కాంతిలో

అతని నవ్వు ముఖం వింతగా ప్రకాశించింది. "మావయ్యా" అని పిల్చే డతను,

"ఏం ?" అని చూసేడు కాంతయ్య.

"చెక్కల ఖరీదు — నీ ప్రకారం — పన్నెండ్రూపాయలు. అందులోకూడా కొంతలాభం ఉంది."

"ఉంది," అన్నాడు కాంతయ్య.

"అదలా ఉణ్నీ. అది లెక్ఖలోకి తీసుకోను. పన్నెండ్రూపాయలు పోగా, నా కూలి అయిదురూపాయలు. మేకులు ముప్పావలా, మొత్తం పదిహేడు ముప్పావలా పోతే ముప్ఫయ్ రెండ్రూపాయల పావలాలాభం కొట్టేశావు మావాఁ !" అన్నాడు సత్యమూర్తి.

నక్క వికవిక నవ్వివట్టు నవ్వేడు కాంతయ్య.

"మావాఁ. ఆలాభం ఏంటో తెలుసా ?" అని అడిగేడు సత్యమూర్తి.

"తెలివైనవాడివి, చెప్పు ! చెప్పు !" అన్నాడు కాంతయ్య.

"నా కష్టవేఁ నీ లాభం కాదా మావాఁ ?" అన్నాడు సత్యమూర్తి.

"పద పద, కాళ్ళు కడుక్కో, ఒహడునష్టపోతేనే ఇంకొకడికి లాభం." అంటూ లేచేడు కాంతయ్య.

"కష్ట పడ్డవాడు నష్టపోతేనే మిగతా వాళ్ళకి లాభాలు." అన్నాడు సత్యమూర్తి.

"కష్టపడ్డందుకు అలిసిపోయేవు. కాస్త భోంచేసి పడుకుందువు గాని" అన్నాడు నవ్వుకొంటూ నట్టింటివైపు నడుస్తున్న కాంతయ్య.

సావిత్రి అంతసేపూ తండ్రివైపే చూస్తూ నిల్చుంది, తండ్రి

నవ్వూ అతనివాటం చూస్తూండగా, అంతవరకూ జ్ఞప్తికి దొరకని విషయం ఆమె కప్పుడు టక్కున గుర్తుకొచ్చింది.

అదొక ఇంగ్లీషు సినిమా. రెండేళ్ళ కిందట చూసిందామె. అదొక ఘోరమైన కథ. అందులో మంచివాళ్ళని మందు పెట్టి చంపేసి, ఆ శవాల్లో దుర్మార్గులు ప్రవేశించి, ఆ శవాల్ని ఆ విధంగా బతికించి, నానా భీభత్సం చేస్తారు. ఆ బతికిన శవాలు మంచివారిగా కనిపిస్తూనే నానా ఘోరాలూ చేసేస్తాయి. అమాయకంగా ఉండే భర్త అలానే కనిపిస్తూ భార్యని బ్రిడ్జిమీంచి ఏట్లోకి తోసేస్తాడు. పతివ్రతైన ఆడమనిషి అలాగే నటిస్తూ భర్తని పొయ్యిలో పెట్టి కాల్చేస్తుంది. తండ్రి, వాత్సల్యంతో ఉంటున్నట్టే ఉంటూ కూతురి గొంతు పిసికేస్తాడు. ఇంటిల్లిపాదినీ పెంచి పెద్దచేసిన ముసలినౌఖరు ఇంటిల్లిపాదినీ చంపేసి ఇనప్పెట్టె తెరుస్తాడు. స్నేహితుడు స్నేహంగానే కనిపిస్తూ స్నేహితుడ్ని హతమారుస్తాడు. స్వాములవారు పరమ సాత్త్వికంగా ఉంటూనే భక్తుల్ని భుజించేస్తాడు. ఆ సినిమా కథలోని లోకంలో మంచివాళ్ళకి బతుకులేదు. పాములు మనుషులుగా మారి విషానికి నీతిపూత పూసి మాయకి తళుకురంగులు వేసి మానవలోకాన్ని మాపేస్తున్నట్టుగా చూపించేరు. ఆ సినిమాలో, ఆ లోకంలో అదంతా వాళ్ళు డబ్బు డబ్బు డబ్బుకోసం చేసేరు; అన్ని ఘోరాలూ వాళ్ళు అందుకోసమే చేసేరు. ఆ సినిమా జ్ఞాపకం వచ్చినప్పుడల్లా సావిత్రికి భయం వేస్తుంది; నిద్ర పట్టదు; హడలెత్తిపోయి అలా కదలకుండా పడుక్కుంటుంది.

ఇప్పుడామెకి తన నాన్న....

నాన్న కాడితను! నాన్నకాడు! దొంగ నాన్న! దుష్టుడు ప్రవేశించిన నాన్నశవం!! హమ్మయ్యో హమ్మయ్యో! నాన్న మా మంచినాన్న ఏమైపోయేడు??? నాన్న! నాన్నా!! నాన్నా....

పూల కళ్ళనుకొని భ్రమించి దగ్గరగా వెళ్ళి పాముకళ్ళని తెలుసుకున్న పావురా పిట్టలా సావిత్రి వజవజ వణికిపోతూ నిలబడి పోయింది.

ఆ సమయంలో సత్యమూర్తికూడా చిన్న పెంకి ఆలోచనలో ఉన్నాకూడా మాఁవయ్యాలా ఉంటేనే తనకి మంచిదేమోననే ఆలోచన అతన్లో మెదిలింది; అతని ముఖంలో అతిచిన్న దుష్టనవ్వు అటూ ఇటూ పాకింది. అలా ఆలోచిస్తూ మరదలి వివర్ణవదనం చూసేసరికి అతనికి తెలవొచ్చిన ట్టయింది.

"ఏం సావిత్రీ ? ఏఁవిఁ టలా చూస్తున్నావు ? ఏవిఁ టయింది?" అంటూ ఆమెవైపు నడిచే డతను.

"బావకూడా పాము ప్రవేశించిన బావశవం కాదుకద ?:" అని ఎందుచేతనో అనుకొంటూ భయపడ్డ సావిత్రి గజగజా వణికింది.

ఆ రాత్రి జాలిగా అతి జాలిగా భగవంతుణ్ని ప్రార్థించి నిద్ర పోయింది సావిత్రి. భగవంతు డామె ప్రార్థన వింటూ నిద్రపోయేడో లేక నిద్రలో ఆమె ప్రార్థన వినలేకపోయేడో ఆమెకి తెలియలేదు. ●